క్లుప్తంగా

ఉపాధి పనులపై గ్రామసభలు

అడ్డతీగల: మండలంలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకూ జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన గ్రామసభలు ఈనెల 21 వరకూ నిర్వహిస్తున్నట్టు ఏపీవో అరవాలు తెలిపారు. మండల వ్యాప్తంగా 22 గ్రామ పంచాయతీల్లో ఈ ఏడాది కాలంలో జరిగిన పెరిక్లేషన్ ట్యాంకులు, ఫారంపాండ్లు, కాలువ పూడికతీతలు ఇతరత్రా పనులు చూస్తారన్నారు. ఆయా పనులకు ఏడాది కాలంలో రూ.13 కోట్లు వ్యయం చేసినట్టు చెప్పారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఈనెల 24 న మండల కేంద్రమైన అడ్డతీగలలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని స్టేట్ రిసోర్స్ పర్సన్‌లు నివేదిక సమర్పిస్తారన్నారు.

పుస్తకాలు, బ్యాగుల పంపిణీ



ఉపాధ్యాయులకు బ్యాగులు అందజేస్తున్న ఎంఈవో లక్ష్మయ్య

కూనవరం: మండల పరిధిలోని 63 పాఠశాలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ పూర్తి చేసినట్టు ఎంఈవో-2 లక్ష్మయ్య తెలిపారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో వివిధ పాఠశాలలకు చెందిన 63 ఉపాధ్యాయులకు 2,739 మంది విద్యార్థులకు ఫస్ట్ స్పెల్ (మొదటి విడత) పాఠ్యపుస్తకాల పంపిణీ చేశామన్నారు. 2,739 మంది విద్యార్థులకు 14,100 పాఠ్యపుస్తకాలు, 16,292 నోట్‌బుక్స్ 1,568 మందికి బెల్ట్‌లు, 2,739 మందికి బ్యాగ్స్, 2,022 మందికి బూట్లు పంపిణీ చేశామన్నారు.

హెచ్‌ఎం తీరుపై అధికారులకు ఫిర్యాదు

- ప్రజాప్రతినిధులపై హెచ్‌ఎం నిర్లక్ష్యంపై ధ్వజం

రంపచోడవరం: గెద్దాడ ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరరావు స్థానిక ప్రజాప్రతినిధుల పట్ల నిర్లక్ష్యధోరణి ప్రదర్శిస్తున్నారని గెద్దాడ సర్పంచ్ వడగల ప్రసాద్ ఆరోపించారు. మండలంలోని గెద్దాడలోని పాఠశాలలో విద్యార్థులకు ఈనెల 13న జరిగిన పుస్తకాలు, బ్యాగులు పంపిణీ కార్యక్రమంపై స్థానిక ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం ప్రోటోకాల్ ఉల్లంఘనే అన్నారు. ఇదే గ్రామంలో ప్రథమ పౌరుడైన తనకు ఆహ్వానం పంపకపోవడం ఏమిటన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఎవరు చెప్పకుండానే తన ఇష్టారీతిగా కార్యక్రమం చేశారని ఆరోపించారు. పాఠశాల హెచ్‌ఎం తీరుపై అధికారులు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



పి.యర్రగొండలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

వై.రామవరం: వై.రామవరం నుంచి అడ్డతీగల వెళ్లే ప్రధాన రహదారిలో మండలంలోని పి.యర్రగొండ గ్రామ సమీపంలో ఆదివారం సీఐ బి.నరసింహమూర్తి ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఒక పక్క వరుస ఎన్‌కౌంటర్‌లో మరోపక్క సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నట్టు సమాచారం మేరకు స్థానిక ఎస్‌ఐ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. వాహనాల్లో రవాణా చేస్తున్న వస్తువులను, బ్యాగ్‌లను సోదాలు చేశారు. వాహన రికార్డులను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని వాహనచోదకులపై కేసులు నమోదు చేశారు. అనుమానస్పద వ్యక్తులు, అపరిచితులపై గట్టి నిఘా విధించారు.

110 మందికి వైద్య పరీక్షలు



రోగులకు గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తున్న డా పోతుల రామారావు

రంపచోడవరం: మండలంలోని సిరిగిందలపాడులో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల (రాజమహేంద్రవరం) ఆధ్వర్యంలో క్యాంపు కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ పర్యవేక్షించారు. శిబిరంలో వైద్యులు తలారి వెంకట సుబ్బారావు, పోతుల రామారావు, దాసరి ఉమమహేష్, రాయుడు శ్రీనివాస్ పాల్గొని 110 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్డియాలజిస్ట్ పోతుల రామారావు తదితరులు రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులపై అవగాహన కల్పించారు. రామకృష్ణ మిషన్ క్యాంపు ఇన్‌చార్జి స్వామి లోకమయనందజీ మహారాజ్, క్యాంప్ కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

- కియోస్క్ సేవలపై నిర్లక్ష్యం
- రైతు సేవా కేంద్రాల్లో నిరుపయోగంగా యంత్రాలు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అక్కసుతోనే నిలిపివేసిన సేవలు
- సేవలు కొనసాగించాలని కోరుతున్న రైతులు



నాడు కియోస్క్ యంత్రం ద్వారా వ్యవసాయ సమాచారం తెలుసుకుంటున్న రైతులు (ఫైల్)



ముంచంగిపుట్టులో నేడు నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రం

ముంచంగిపుట్టు: వ్యవసాయంలో రైతులకు అన్ని విధాలుగా సహాయ సాకారాలు అందించాలని మంచి ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్నదాతకు ప్రభుత్వ సేవలన్నీ అందేలా వీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉండే విధంగా వ్యవసాయాధికారులను ఉంచారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేశారు. రైతులకు సకాలంలో సాగు కోసం పెట్టుబడి సాయం, ఉచితంగా విత్తనాలు, ఎరువుల పంపిణీతో పాటు వ్యవసాయ పనిముట్లను అందజేశారు. దీంతో పాటు రైతులకు సకల సమాచారం అందించాలనే మంచి లక్ష్యంతో రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. భూసార పరీక్ష నుంచి అధిక దిగుబడి సాధించేందుకు అవసరమైన అన్ని రకాల సేవలను గ్రామాల్లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. కియోస్క్ యంత్రాల ద్వారా ఎరువులు, పురుగు మందులను ముందస్తుగానే బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. వ్యవసాయంలో ఏ భూమిలో ఏ పంట సాగు చేయాలని, దానికి అవసరమైన విత్తనాలు,పురుగు మందులు,ఎరువులు గురించి తెలుసుకోవడం, పశువులకు వచ్చే వ్యాధులు సంబంధించి అన్ని ప్రయోగాలు కియోస్క్ యంత్రం ద్వారా తెలుసునేలా ఏర్పాటు చేశారు. సమస్త సమాచారాన్ని ముందుస్తుగా గిరిజన రైతులు తెలుసుకునే వారు. ఈ కియోస్క్ సేవలను సంపూర్ణంగా గిరిజన రైతులు సద్వినియోగం చేసుకున్నారు.

మూలకు చేరిన యంత్రాలు

రైతులకు మేలు చేసే అంశాలు ఏ ప్రభుత్వంలో జరిగిన దానిని కొనసాగించాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న ప్రభుత్వంపై ఉంటుంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించింది. రైతుకు పెట్టుబడి సాయం దూరం చేసింది. ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటల వేసుకునేందుకు కూటమి ప్రభుత్వం నుంచి సాయం అందక అప్పులు చేసుకొని సాగు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కియోస్క్ సేవలను రైతులకు దూరంగా చేసింది. ఆయా సేవలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన యంత్రాలను మూలన పడేసింది. ఏడాదిగా ఒక్కసారి కూడా వినియోగించిన పాపాన పోలేదు. ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీల్లో 7 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. కేంద్రాలో 7 కియోస్క్ యంత్రాలు ఉన్నాయి.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కొక్క కియోస్క్ యంత్రం ఏర్పాటుకు రూ.90వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేసింది. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యానికి మండలంలో లక్షలాది రూపాయల విలువైన యంత్రాలు మూలకు చేరాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వీటి ద్వారా స్థానిక రైతులకు వ్యవసాయ అధికారులు, వీఏఏలు,వీహెచ్‌ఏలు సమగ్రమైన సమాచారం అందించేవారు. విత్తనాలు, ఎరువులు ముందుగానే బుక్ చేసుకునేవారు. ఇప్పుడు ఈ సేవలు పొందే పరిస్థితి లేకుండా పోయింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కియోస్క్ యంత్రాల సేవలకు శ్రీకారం చుట్టిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పేరు వస్తుందని అక్కసుతో వాటిని వినియోగించకుండా కూటమి ప్రభుత్వం రైతులకు దూరం చేస్తోంది. దీంతో సాగు పద్ధతుల్లో నష్ట నివారణకు సకాలంలో సరైన సూచనలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం కియోస్క్ యంత్రాలు అందుబాటులోకి తీసుకురావాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

సేవలు కొనసాగించాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు ఉపయోగకరంగా ఉండేందుకు అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కియోస్క్ యంత్రం ఏర్పాటుచేశారు. ఎరువులు, పురుగుల మందులు బుకింగ్ చేసుకునేవాళ్లం. వ్యవసాయానికి ఎంతో ఉపయోగపడేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కియోస్క్ యంత్రం వినియోగంలోకి తీసుకురాలేదు. రైతు సేవ కేంద్రంలో నిరుపయోగంగా ఉన్నాయి. రైతులకు మేలు చేసే కియోస్క్ యంత్రం సేవలు వినియోగంలోకి తీసుకురావాలి.

– **కిల్లో లోకినాథ్**, గిరిజన రైతు, బిమిడి గ్రామం, బరడ పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

ప్రభుత్వ ఆదేశాల మేరకు వినియోగిస్తాం



రైతు సేవ కేంద్రాల్లో కియోస్క్ యంత్రాల వినియోగం ప్రస్తుతం లేదు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకే వాటిని వినియోగిస్తాం. మండలంలో రైతులకు అవసరమైన విత్తనాలు పంపిణీ చేయడం జరిగింది. 23 పంచాయతీల్లో 7 కియోస్క్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం వీటి అవసరం రైతులకు లేదు. అందుకే వినియోగించడం లేదు. – **శ్రీనివాసబాబు**, మండల వ్యవసాయాశాధికారి, ముంచంగిపుట్టు

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ కుమారి

గూడెంకొత్తవీధి: మండలంలోని రంపుల గ్రామంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పీఎం జన్‌మన్ గ్రామసభ ఆదివారం నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు అనేక అంశాలను దీనిలో నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ బోయిన కుమారి మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను ఎంపీడీవో దృష్టికి తీసుకురావాలని కోరారు. తాగునీటి తదితర సమస్యలను తెలియజేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, పీఎం ఆయుష్మాన్ కార్డులు, పీఎం కిసాన్ లేని వారికి చేయిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో డీఆర్ డిపో భవనం సరిగా లేదని, సమస్య పరిష్కరించాలని కోరారు.దీంతో పాటు అనేక సమస్యలను ఎంపీడీవో దృష్టిలో ఉంచారు. వైస్ ఎంపీపీలు దేవుడు, ఆనంద్, పెదవలస సర్పంచ్ కృష్ణవంశీ, స్థానికులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి



ఏవో శ్రీనివాసరావు

చింతపల్లి: గిరిజన రైతులు ఈనెల 18వ తేదీ లోగా ఈ కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే రైతు అర్హుల జాబితాను రైతు సేవా కేంద్రంలోని నోటీసుబోర్డులో పొందుపరిచామన్నారు. రైతులు తమ వివరాలు సరిచూసుకొని ఈ కేవైసీ చేసుకోవాలన్నారు. ఈ కేవైసీ వేసుకున్న జిరాయితీ, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన రైతులకు మాత్రమే లబ్ధి చేకూరుతుందన్నారు. ఈనెల 18వ తేదీలోగా రైతు సేవా కేంద్రం సిబ్బందిని రైతులు సంప్రదించి ఈ కేవైసీ వేసుకోవలసినదని వ్యవసాయ అధికారి కోరారు.

అటవీ భూములు ఆక్రమిస్తే చర్యలు



నోటీసులు ఇస్తున్న సిబ్బంది

చింతపల్లి : అటవీ భూములు ఆక్రమిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక డివిజనల్ ఫారెస్టు అధికారి వై.వి.నరసింహారావు హెచ్చరించారు. డీఎఫ్‌వో ఆదేశాల మేరకు అటవీశాఖ ఉద్యోగులు చిలకలమామిడి గ్రామంలో ఆదివారం పర్యటించారు. గ్రామంలో అటవీశాఖకు చెందిన స్థలాన్ని ఆక్రమించిన పది మందికి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ అటవీహక్కుల చట్టం ప్రకారం డివిజన్ పరిధిలో 98 ఎకరాల భూములను గిరిజనులకు పంపిణీ చేశామన్నారు. ఈ భూముల్లో వృక్ష సంపదకు హాని కలగకుండా గిరిజనులు వ్యవసాయం చేసుకోవాలన్నారు. అటవీశాఖ పరిధిలో ఉన్న భూములను ఆక్రమించుకుంటే చర్యలు తప్పవన్నారు. చింతపల్లి పంచాయతీ సౌత్ బీట్ పరిధిలో చిలకడమామిడి గ్రామంలో కొంత భూమిని గిరిజనులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దీంతో ముందుగా హెచ్చరిక నోటీలు జారీ చేశామన్నారు. నిబంధనలు అతిక్రమించి భూములను ఆక్రమించుకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఫారెస్ట్ అధికారులు ఎం.భూషణం, డి.పుష్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి



కార్యకర్తలు, నాయకులతో సమావేశం అనంతరం మాట్లాడుతున్న రేగం చాణక్య

డుంబ్రిగుడ: మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ నాయకుడు రేగం చాణక్య ఆదివారం సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా పార్టీ అండగా ఉంటుందని, ఎవరికి ఎటువంటి కష్టం వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఉమ్మడి విశాఖ ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు, కమ్మిడి అశోకుమార్, గుంటసీమ, కితలంగి సర్పంచ్‌లు గుమ్మా నాగేశ్వరరావు, వి.సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు రామారావు, విజయ, నాయకులు చిరంజీవి, మఠం శంకర్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: ఎం.కోడూరులోని మోదకొండమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే ఒడ్డు పండగలు నిర్వహించి, అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తులకు కొమాళ్లపూడికి చెందిన రావి సత్తిబాబు సాయిదుర్గ కుటుంబ సభ్యుల సహకారంతో ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్, అలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవిరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు

మునగపాక: ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. ఫాదర్స్ డే సందర్భంగా ఆదివారం మునగపాక దళితవాడలో ఓ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ కుటుంబాన్ని నడిపించే తండ్రి పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దిమ్మల నూకరాజు, కరణం గణేష్, బీలా అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు చేయూత



ఇంటి నిర్మాణానికి రేకులు, పైపులు అందజేస్తున్న దాత జమాల్‌ఖాన్

వి.ఆర్.పురం: మండలంలోని రామవరం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బాధితుడు సోలా నరసింహరావుకు, గుర్రంపేట గ్రామంలో మతిస్థిమితం లేని మడకం రమణమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆదివారం జేకే చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు మహమ్మద్ జమాల్‌ఖాన్ సిమెంట్ రేకులు, ఐరన్ పైపులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ట్రస్టు తరపున తన వంతు సాయం చేస్తున్నట్టు చెప్పారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు బాధితుల ఇళ్ల నిర్మాణానికి సామగ్రి అందజేశామన్నారు. గ్రామస్తులు నాగయ్య, ముత్తయ్య, ట్రస్ట్ సభ్యులు ఎస్‌కె షాజహాన్, ఎండి జహంగీర్, పి.సాల్మన్‌రాజు, నటరాజు, యాకుబ్ పాషా పాల్గొన్నారు.

ఘనంగా శివాలయం వార్షికోత్సవం



ఎం.అలమండ శివాలయంలో హోమం చేస్తున్న భక్తులు

దేవరాపల్లి: ఎం.అలమండలో శివాలయం 20వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ నియమ నిష్ఠలతో హోమం జరిగింది. స్వామి వారికి 101 కలశాలతో భక్తులు అభిషేకాలు చేశారు. తెల్లవారుజాము నుంచి స్వామి వారిని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీగా అన్న సమారాధన జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

రంపచోడవరం జిల్లా ఏర్పాటుకు డిమాండ్

చింతూరు: రంపచోడవరం డివిజన్ ప్రజలకు పాడేరు జిల్లా కేంద్రం ఎంతో దూరాభారంగా మారిందని, దీనివలన ఆదివాసీలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కుంజా దూలయ్య డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీలు తమ సమస్యలు చెప్పుకునేందుకు ఉన్నతాధికారుల వద్దకు పాడేరు వెళ్లాలంటే ఆర్థికంగా ఎంతో భారమవడంతో పాటు సమయం వృథా అవుతోందన్నారు. రవాణా సౌకర్యం సరిగా లేకపోవడంతో పాడేరు వెళ్లి వచ్చేందుకు రోజుల సమయం పడుతుందని, ప్రభుత్వం ఆదివాసీల కష్టాలను దృష్టిలో ఉంచుకుని రంపచోడవరంను జిల్లా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చెంతనే ఉన్న పట్టణ ప్రాంతాలను వదిలేసి ప్రభుత్వం రహదారి విస్తరణ పేరుతో ఏజన్సీలోని రంపచోడవరం, మారేడుమిల్లి వంటి ప్రాంతాల్లో కట్టడాలను కూల్చివేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ చర్యలను ఉపసంహరించుకోవాలని, కూల్చివేసిన ఇళ్లు, దుకాణాల బాధితులకు ఐదుసెంట్ల స్థలం ఇవ్వడంతో పాటు వాటిని ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని ఆయన కోరారు. 2006 అటవీహక్కుల చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కృష్ణకుమారికి సేవా పురస్కారం



తెలంగాణలో సేవా పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణకుమారి

డుంబ్రిగుడ: మండల కేంద్రానికి చెందిన సమాజ సంఘ సేవకురాలు కమ్మిడి కృష్ణకుమారికి తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సంస్థల కళాకారుల సమాఖ్య హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం సేవా పురస్కారం అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి ఫోన్‌లో విలేకరులతో మాట్లాడి తాను గిరిజన ప్రాంతంలో చేస్తున్న వివిధ సేవలకు గాను అవార్డు అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు, సాహితీవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

500 ఘటాలతో మోదకొండమ్మ వీధి పండగలు



మోదకొండమ్మ ఘటాలు శిరస్సున పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి వెళుతున్న భక్తులు

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ వీది పండగలు వందలాది మంది భక్తులు ఆదివారం నిర్వహించారు. సుమారు 500 మంది భక్తులు అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలు శిరస్సున పెట్టుకుని డప్పులు, వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఆలయానికి కాలినడకన చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. మాడుగుల గవర వీధికి చెందిన పెంటకోట కొండబాబు, లక్ష్మి కుటుంబ సభ్యులు 101 ఘటాలు, అర్బన్ కాలనీకి చెందిన పోతక కళ్యాణం కుమారులు ఈశ్వరరావు, జగ్గారావు, కుటుంబ సభ్యులు 101 ఘటాలతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చిన మరో 300 మంది భక్తులు ఘటాలు శిరస్సున పెట్టుకుని పండగ చేశారు. ఈ పండగలో నూతనంగా ఎన్నుకోబడిన 16 మంది కమిటీ సభ్యులు సేవలందించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు విజయలక్ష్మి, చిన్నారావు, విశ్వేశ్వరరావు, లక్ష్మణరావు, జగన్, మోది నాయుడు, వెంకటరమణ పాల్గొన్నారు.

టైప్-4 కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కె.కోటపాడు : కె.కోటపాడు హైస్కూల్‌లో గల టైప్-4 కేజీబీవీలో చేరేందుకు గల ఆసక్తి గల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఈవోలు కె.సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ తెలిపారు. కేజీబీవీలో 9, 10, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో చేరు విద్యార్థులు ఈ నెల 30లోగా అడ్మిషన్‌లను పొందాలని కోరారు. టైప్-4 కేజీబీవీలో హాస్టల్ సదుపాయం ఉందని, కుల, ఏడాదికి రూ.లక్షా 44వేల ఆదాయం లోపుగా ఉన్న ధ్రువపత్రాలతో కె.కోటపాడు హైస్కూల్ హెచ్‌ఎంకు దరఖాస్తు అందించాలని సూచించారు. అనాథలు, సెమీ అనాథలు, వైకల్యం ఉన్న విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. తదుపరి రిజర్వేషన్‌ల నియమాన్ని పాటిస్తూ మిగిలిన సీట్లను భర్తీ చేయడం జరుగుతుందని వారు తెలిపారు.

సమస్యలతో సతమతం

- వీధుల్లో కానరాని మౌలిక సదుపాయాలు
- స్థానికుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



వీధిలో రహదారి దుస్థితి

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని మామిడిచెట్టు వీధిలో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. సీసీ రోడ్డు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యంల లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మామిడి చెట్టు వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయితే పనులను అప్పట్లో కొంతమంది అడ్డుకోవడంతో రోడ్డు నిర్మాణం జరగలేదు. ఏళ్లు గడుస్తున్నా వీధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు వెంటాడుతున్నాయి. సీసీ రోడ్డు లేకపోవడంతో మట్టి రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నామని, వర్షం పడితే దారంతా చిత్తడిగా మారుతోందని, నానా అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిత్తడి దారి వలన పలువురు జారిపడి గాయాలపాలవుతున్నారని ఆందోళన చెందుతున్నారు. తాగునీటి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ, తాగునీటి సదుపాయం కల్పించాలని వారు కోరుతున్నారు.



నిరుపయోగంగా కుళాయి

వృత్తివిద్య కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

మాడుగుల రూరల్ : మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్య కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె. మురళీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ నెలాఖరు లోపు ప్రవేశాలు పొందవచ్చునన్నారు. కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రభుత్వం ఏటా జాబ్ మేళాలు నిర్వహించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఎంఈటి, రెండేళ్ల కోర్సు, పాలిటెక్నిక్‌లో రెండో ఏడాది ప్రవేశాలు పొందవచ్చునన్నారు. ఐదు శాతం సీట్లు కేటాయిస్తారన్నారు. ఈఈటీ కోర్సు ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన కోర్సు. దీంతో పాటు సిఈటీ కోర్సు సివిల్ ఇంజినీరింగ్ చేయాలనుకునే వారికి పునాదిగా ఉపకరిస్తుందన్నారు. ఎంపిహెచ్ డబ్ల్యూ(యఫ్) కోర్సు చేసిన బాలికలకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ఆయా కోర్సులకు నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.